కామెడీ కథ

# 'శిక్ష'ణా కేంద్రం

**బు**ల్లితెర మీద కనిపించాలని ఉందా? నటీనటులుగా, యాంకర్లుగా ఇరగదీయాలని వుందా? నేడే మా ధారావాహికల శిక్షణా కేంద్రానికి విచ్చేయండి. ఫీజు తక్కువ ఫలితం ఎక్కువ... రోజూ మీ మొహాలు టీవీల్లో కనిపిస్తాయి. మీ మాటలు టీవీ సెట్లలో వినిపిస్తాయి. ఇంకెందుకాలస్యం. వెంటనే హర్రీ అప్...

ఇట్లు
'ఈ బతుకింతేరా' ధారావాహికల శిక్షణా కేంద్రం
ఉత్తుత్తి కాలనీ, హైదరాబాద్

* * *

ఆ ప్రకటన చూసి అఖిలాంధ్రప్రదేశ్‌లోని ఔత్సాహికులే కాదు, యావద్భారతంలోని ఔత్సాహికులూ ఫీజుల కవర్లు పట్టుకొని బయల్దేరారు. రోజూ టీవీలో మొహం కనిపించడమంటే మామూలా... హమ్మో...అని గుండెల మీద చేయేసుకుని ఆనక, డబ్బుల మీద ఓ కన్నేసుంచి హైదరాబాద్‌కి కదిలి వచ్చారు జనం... గోదావరి పుష్కరాలకు కదిలిన రేంజ్‌లో.

* * *

"హాయ్...హలో...అయామ్ వీకేరావ్...చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, కోచర్, డ్యాన్సర్..." అని ఆగేడు వీకేరావ్.

"కమ్...స్వీపర్..." ముసి ముసి నవ్వులు నవ్వుతూ అన్నాడు ఆఫీస్ బోయ్.

వీకేరావ్ సీరియస్‌గా చూడటంతో కిసుక్కున నవ్వి, టుపుక్కున నోరు కట్టేస్కున్నాడు.

"నీ పేరు?" ఎదురుగా ఉన్న శాల్తీని అడిగాడు వీకేరావ్.

"లబలబరావు" చెప్పాడు అతను.

"వెరీ నైస్ నేమ్. చూస్తే చదువుకున్నవాడిలా ఉన్నావు. ఎందాక చదివేవేమిటి?"

"వీధి బడి దాక" లబలబరావ్ చెప్పేడు.

"నో ప్రాబ్లెమ్...ఎంతుందేమిటి...క్యాషూ...పొలమూ గట్రా...."

"ప్రస్తుతానికి ఫైవ్ తెచ్చాను...పొలమమ్మి ఓ టెన్ తెస్తాను...నగలమ్మి...ఓ పాతిక తెస్తాను...నేను హీరోనైపోతానా?" అడిగాడు లబలబరావ్ సంబరంగా.

"హీరో ఏం ఖర్మ...వాడబ్బవి అవుతావు"

"నాకు హీరో అబ్బ వేషాలొద్దు...హీరో వేషాలే కావాలి" బుంగమూతి పెట్టి అన్నాడు లబలబరావ్.

"ష్యూర్...వెళ్లు క్యాష్ కొట్టు...మొహానికి రంగు కొట్టు...యూ ఆర్ సెలెక్టెడ్...నెక్స్ట్..."

ఓ అమ్మాయి వచ్చింది చేతిలో హ్యాండ్ బ్యాగ్‌తో, ఒంటి మీద నగలతో.

"ఈజిట్ ప్యూర్ గోల్డ్..." పేరూ గట్రా అడక్కుండానే ఆమె నగల వంక చూసి అడిగాడు వీకేరావ్.

"వన్ ట్వంటీ ఫోర్ క్యారెట్ ప్యూర్ గోల్డ్" చెప్పిందా అమ్మాయి తన నగల వంక చూసుకుంటూ.

"ఆ వన్నేమిటి?"

"హండ్రెడ్ పర్సెంట్ గ్యారంటీ మా నగల కొట్టాడిచ్చాడు" చెప్పిందా అమ్మాయి.

"వెరీ గుడ్ క్వాలిఫికేషన్... యూ ఆర్..."

"నో డౌట్ సెలెక్టెడే..." ఆఫీసు బోయ్ క్యాచ్ చేసేశాడు.

అలా బోల్డుమందిని, తిరునాళ్లలో జనమంత మందిని సెలెక్ట్ చేశాడు వీకేరావ్.

* * *

ఆ అమ్మాయిని ఓ కుర్చీలో కూర్చోబెట్టారు.

"ఏమ్మా...నీ పేరేమిటి?" వీకేరావ్ అడిగాడు. అతని భార్య, అదే, మిసెస్ వీకేరావ్ కూడా అక్కడే ఉంది.

"నవ్వులమ్మ" చెప్పిందా అమ్మాయి.

"వెరీగుడ్...ఏదీ ఓసారి ఏడువ్"

"నేనా? నేనెందుకేడుస్తాను?"

"అలా అనకూడదమ్మా...డైలీ సీరియల్స్‌లో ఏడ్వాలి...బాగా ఏడ్వాలి...కమాన్ క్రయ్... ఏడ్వమ్మా.... ఏడువ్..."

"వా..." అని ఏడ్చి ఊర్కుంది నవ్వులమ్మ.

"ఒక్క 'వా' అని ఊర్కుంటే ఎలా అమ్మా? కనీసం లక్ష 'వా'లైనా అనాలి"

"హమ్మో...అంతసేపు ఏడిస్తే గొంతు నొప్పెట్టదూ..." అంది భయంగా.

"మరి నీకు హీరోయిన్‌గా పేరు తెచ్చుకోవాలని లేదా?"

"ఉంది" అందా అమ్మాయి.

"అయితే ఏడువు"

ఈసారి 'వావావా' అని ఏడ్చింది.

"ఇంకా..."

"వావావావావా..."

"ఇంకా...ఇంకా...ఇంకా"

"వా....వావావావావావా"

"ఇప్పుడు ఏడు చూద్దాం" అంటూ మిసెస్ వీకేరావ్ ఆ అమ్మాయికి తొడపాశం పెట్టింది. పదహారున్నర రాగంలో ఏడ్చేసింది నవ్వులమ్మ.

వెంటనే వీకేరావ్...భార్య వంక చూసి-

"వెరీ గుడ్...నా భార్యవనిపించుకున్నావు...ఆ అమ్మాయికి ఇలాగే అరగంటకోసారి తొడపాశం పెడుతూ ఉండు. వారం రోజుల్లో పికప్ అవుతుంది. జీవితంలో చచ్చినా నవ్వదు" అని కెవ్వుమని తన తొడవంక చూసుకున్నాడు.

"నాకెందుకే తొడపాశం పెట్టావు...పొద్దునే ఓసారి పెట్టావుగా..."

"అది పనిమనిషి వంక ఆబగా చూసినందుకు...ఇది..."

"ఇదెందుకే..." తొడ రుద్దుకుంటూ అడిగాడు వీకేరావ్.

"ఈ అమ్మాయి వంక కూడా అలా చూస్తారేమోనని...అడ్వాన్స్‌గా...రేపటికి ఉంచుకోండి..." అంది మిసెస్ వీకేరావ్.

అలా...డైలీ సీరియల్స్‌లో నటించే వాళ్లందరికీ ఏడ్వడంలో శిక్షణ ఇస్తున్నారు.

* * *

ఇప్పుడిహ అత్తపాత్రల వంతు.

ఓ పదహారేళ్లమ్మాయ్ వచ్చింది...వెంటనే వీకేరావ్ ఆ అమ్మాయికి పట్టుచీర...తెల్లవెంట్రుకల విగ్గు తగిలించాడు.

"అంకుల్! వాటీజ్ దిస్ అంకుల్" అమ్మాయి అమాయకంగా అడిగింది.

"నువ్విప్పుడు 'రోజూ ఏడిపిస్తా' సీరియల్‌లో అత్త పాత్ర వేస్తున్నావన్నమాట... 'లక్షొత్తుల నోము'లో బామ్మ పాత్ర వేస్తున్నావట...ఏదీ కాస్త ఆ స్టయిల్‌లో మాట్లాడు"

ఆ అమ్మాయి కళ్లు పెద్దవి చేసింది. ఆ పదహారేళ్ల అమ్మాయికి అరవై ఏళ్ల పాత్ర వేయించడం ట్రైనింగ్ మొదలైంది.మమ్మీ డాడీ అని పిలిచే అమ్మాయి చేత, "ఒసే కోడలుపిల్లా...మనవరాలా..." అని పిలిపిస్తున్నారు. ఆ అమ్మాయి ఇంటికి వెళ్లి కూడా కన్న తండ్రిని 'ఒరే మనవడా...' అంటూంది. అంతలా లీనమైపోయింది.

* * *

లబలబరావు..లబలబలాడుతూ తెగ సంతోషంగా కెమెరా ముందుకు వచ్చాడు. వీకేరావ్ లబలబరావును పరిశీలనగా చూశాడు.

లబలబరావు ముందు ఓ బొమ్మ పెట్టారు.

"సీ మిస్టర్ లబలబా...ఈ బొమ్మ నీ భార్య అనుకో...ఏదీ...ఆమెను అనుమానిస్తూ, క్రూయల్‌గా బిహేవ్ చేయ్"

"అమ్మో...అలా చేస్తే ఇంటికెళ్లాక నా భార్య నా డిప్ప పగలగొడుతుంది"

"అబ్బ...ఆ విషయం నాకు తెలీయదా" అంటూ భయంగా పక్కనే ఉన్న భార్య వంక, తన తొడ వంక చూసుకొని, "ఉత్తుత్తినే నటించాలన్న మాట...నీ భార్యను హింసించాలి...నవ్వాలి...కొట్టాలి...మాటలతో బాధపెట్టాలి...కనీసం అయిదొందల ఎపిసోడ్లన్నా అలా

చేయాలి"

వెంటనే లబలబరావు...యాక్షన్ లోకి దిగిపోయాడు.

"హ్హ..హ్హ..హ్హ..హ్హి..హ్హి..హ్హి.." అంటూ తన భార్య మీద ఉన్న కసినంతా బొమ్మ మీద తీర్చుకున్నాడు. బెల్టుతో కొట్టాడు. సిగరెట్లతో వాతలు పెట్టాడు. బ్లేడుతో గీకాడు.

"వెరీగుడ్" అన్నాడు తృప్తిగా వీకేరావ్.

★ ★ ★

నెక్స్ట్...

యాంకర్స్‌కు ట్రైనింగ్.

"ఏం చదువుకున్నావమ్మా?" అడిగాడు ఓ అమ్మాయిని వీకేరావ్.

"ఎం.ఎ. తెలుగు"

"ప్చ్...మాకు టెన్త్ ఇంగ్లీష్ మీడియం చదివిన వాళ్లు కావాలి. సర్లే... 'హాయ్ వ్యూయర్స్...' అనమ్మా..."

"ప్రేక్షక మహాశయులారా..." మక్కికి మక్కి కాకుండా కాస్త తగ్గి అనువదించింది ఆ అమ్మాయి.

"నో..నో.. హాయ్ వ్యూయర్స్..అనే అనాలి"

"తెలుగు చానెల్ కదండీ"

"అయినా ఇంగ్లీలోనే స్పీకాలి"

అలానే అంది ఆ అమ్మాయి.

"ఇప్పుడు మీ ఆందర్నీ ఇల కలుశుకోవడం భాగుంది...అనమ్మా..."

"మాడు పగుల్ది...క్షమించండి ఆచార్యా...మీ అందర్నీ ఇలా కలుసుకోవడం బావుంది..."

"అబ్బా...మీ చదువుకున్న వాళ్లతో ఇవే తిప్పలు... 'మీ ఆందర్నీ ఇల కలుశుకోవడం భాగుంది' అనే అనాల...అది రూలు"

"కానీ అది వ్యాకరణ విరుద్ధం ఆచార్యా"

"అమ్మా...తల్లీ...అలా వద్దు...నీ వాక్శుద్ధిని తీసి టీవీ మీద ఫ్లవర్‌వాజులా పెట్టుకో. భయం బదులు బయం, బాధ బదులు భాద...అలా పలకాలి... రిథమిక్...రిథమిక్ నేర్చుకోమ్మా..."

అలానే అంటూ తెలుగును భ్రష్టు పట్టించడానికి నడుం బిగించింది ఆ కాబోయే యాంకరిణి.

★ ★ ★

"మనమ్మాయి నవ్వులమ్మ ఏం చేస్తూంది...పెళ్లివారొచ్చారు...తీసుకురా..."

"ఏంటి తీసుకువచ్చేది మీ తలకాయ. ఏడుస్తూ కూచుంది. దిక్కుమాలిన ధారావాహికల శిక్షణా కేంద్రం అని... పొద్దస్తమానం ఏడుస్తూనే ఉంది..."

కట్ చేస్తే మరో దృశ్యం.

★★★



"పక్కనే ఉన్న షాపులో అరడజను ఎగ్స్ తీసుకురావడానికి నాలుగ్గంటలా?" కోపంగా అంది మిసెస్ వీకేరావు మొగుడ్ని.

"ఏం చేయమంటావే...స్లోమోషన్ అందరికీ అలవాటు చేసీ చేసీ నాకూ అదే అలవాటైంది...అడుగులో అడుగు వేసి, నడిస్తే తప్ప నడిచినట్టు అనిపించదు"

"బుద్ధి ఉందా మీకు...మీకు బుద్ధి ఉందా, ఉందా బుద్ధి మీకు... మీకు ఉన్నదా బుద్ధి...ఆడదంటే అలుసా... ఆడదంటే కంట్లో నలుసా..ఆడదంటే పచ్చిపులుసా..." కోపంగా రొప్పుతూ అన్న డైలాగే అంటూ, చేతులు తిప్పుతూ అరగంట పాటు అని, ఓ పెద్ద గ్లాసుడు హార్లిక్స్ తాగి రిలాక్సయింది మిసెస్ వీకేరావ్.

★ ★ ★

ధారావాహికల శిక్షణా కేంద్రం.

కొందరమ్మాయిలకు అదే పనిగా ఏడ్వడంలో శిక్షణ. కొందరు టీనేజీ అమ్మాయిలకు అత్తల, బామ్మల గెటప్పుల్లో శిక్షణ. చెప్పిన డైలాగ్‌ని విరిచి, విరిచి చెప్పడంలో శిక్షణ.

ఒత్తులు ఉన్నచోట లేకుండా, లేనిచోట దీర్ఘాలు తీసి పలకడంలో యాంకర్లకు శిక్షణ. గంటకో అడుగేసి పరుగెత్తుకు రావడంలో శిక్షణ.

ఈ శిక్షణలన్నీ తీసుకుని ఇంటికెళ్లాక, ఆ శిక్షణలో లీనమై ఇంటిల్లిపాదీ బుల్లితెరమీద వీళ్ల వీర నటనతో ప్రేక్షకులూ 'శిక్ష'కు గురైతే, ఆ తప్పు ఎవరిది...?

***(అంకితం: టీవీ సీరియల్స్ బాధితులకు)***

**ముచ్చర్ల రజనీశకుంతల**